

## మూడు వాహనాలు ఢీ

మూడు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలైన సంఘటన ఓజిలిలో చోటుచేసుకుంది. - 8లో



## సామాన్యులకు ప్రాధాన్యం

శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. - 8లో



## వైభవం.. ధ్వజారోహణం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో గురువారం ప్రారంభమయ్యాయి. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు విద్యాదీవెన

**తిరుపతి అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం పేదల చదువులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారు. మరోవైపు మన బడి నాడు–నేడు పేరుతో పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించి రూపురేఖలు మార్పు చేశారు. అంతేకాకుండా ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడం, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ''మీరు చదువుకోండి...మేనమామగా నేను చదివిస్తా'' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసాతో బడుగుబలహీల వర్గాలకు చెందిన ఎందరో ఉన్నత చదువులతోపాటు విదేశాల్లో సైతం చదువుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో అక్షరాస్యతా శాతం పెరగడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కృష్ణా జిల్లా పామర్రు నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం (మార్చి 1వ తేదీ) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి జిల్లా కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేపడుతున్నారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 66,915 మంది స్వామివారిని దర్శించుకోగా 20,784 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 08 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### నేటి నుంచి చౌకదుకాణాల్లో రాగిపిండి

**తిరుపతి అర్బన్:** పేదలకు పౌష్టికాహారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా అడుగులు వేస్తోంది. రేషన్ కార్డుదారులకు ఇప్పటికే పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా అందిస్తోంది. అంతేకాకుండా రూ.16కే కిలో గోధుమ పిండి కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. తాజాగా మార్చి 1వ తేదీ నుంచి కార్డుదారులకు రూ.11కు కిలో రాగి పిండి ఇవ్వడానికి సిద్ధం అయ్యారు. మార్కెట్‌లో కిలో రాగి పిండి రూ.45 పలుకుతోంది. అయితే జగన్ సర్కార్ రూ.11కే అందించాలని భావిస్తోంది. బియ్యం, చక్కెర, గోధుమపిండితో పాటు అదనంగా రాగి పిండి ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ఎస్వీయూలో రేపు జాబ్ మేళా

**తిరుపతి సిటీ :** స్థానిక ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శనివారం మార్చి 2న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఐదు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొని 130 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పీజీ అర్హత గల అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలియజేశారు. మంచి ప్యాకేజీతో వేతనాలు ఉంటాయని ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7989810194 సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### డయల్ యువర్ ఈఓ రేపు

**తిరుమల:** డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలను టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలపవచ్చు. ఇందుకు భక్తులు 0877–2263261 నంబర్‌ని సంప్రదించాల్సి ఉంది.

# జగనన్న ఆరోగ్య అభయం

ఓ మనిషి ప్రాణాన్ని కాపాడేందుకు వైద్యులు ఎంతో శ్రమిస్తారు.. అందుకే డాక్టర్‌ని దేవుడంటారు! మరి చంద్రగిరి నియోజకవర్గంలో ఏకంగా 72,812 కుటుంబాలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన దాతను ఏమని పిలవాలి? నాలుగున్నరేళ్లలో దాదాపు 12,129 మందికి ఉచిత వైద్యంతో ప్రాణం పోసిన 'డాక్టర్'ను ఎవరితో పోల్చాలి? ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లాక జీవన భృతి కోసం ఆదుర్దా పడకుండా రోగికి డబ్బులిచ్చి మరీ చిరునవ్వుతో సాగనంపే మానవీయ కోణాన్ని ఎవరైనా మరువగలరా? ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి ఊపిరిలూదిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తూ, దేశంలోనే ఆరోగ్య పాలన అందిస్తున్న ప్రాణదాతగా ఖ్యాతి గడించారు.



**ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరు వివరాలు**

| మండలం | మంజూరు | పంపిణీ |
|---|---|---|
| తిరుపతి రూరల్ | 30,187 | 18,715 |
| చంద్రగిరి | 12,225 | 3,876 |
| పాకాల | 10,945 | 5,886 |
| రామచంద్రాపురం | 7,481 | 4,543 |
| ఎర్రావారిపాళెం | 6,449 | 4,081 |
| చిన్నగొట్టిగల్లు | 5,525 | 1,038 |
| మొత్తం | 72,812 | 38,139 |

- చంద్రగిరి నియోజకవర్గంలో రూ.33.74 కోట్ల వైద్య భరోసా
- బెంగళూరు, చెన్నై, హైదరాబాదు నగరాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు
- వైద్య సేవలతో పాటు రవాణా, భోజన, వసతి నదుపాయం
- పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- నియోజకవర్గంలో 73 వేల కుటుంబాలకు భరోసా




**తిరుపతి రూరల్:** చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 72,812 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు అయ్యాయి. తిరుపతి రూరల్ మండలంలో 30,187, చంద్రగిరి–12,225, పాకాల–10,945, రామచంద్రాపురం–7,481, ఎర్రావారిపాళెం–6,449, చిన్నగొట్టిగల్లు–5,525 మొత్తం 72,812 కార్డులను ఇంటి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందిస్తున్నారు. శుక్రవారం వరకు 38,189 కార్డులను పంపిణీ చేశారు. 20వ తేదీ లోపు వంద శాతం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**అందరికీ అభయం**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ ఏడాది నవంబర్ నెలాఖరువరకు ఆరోగ్యశ్రీ పథకం కింద 24,129 మందికి ఉచితంగా వైద్యం అందుకున్నారు. వీరి వైద్యం కోసం ప్రభుత్వం ఏకంగా రూ.33.58 కోట్లు ఖర్చు చేసింది. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటితే ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యాన్ని అందిస్తోంది. మరోవైపు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కోసం రూ.26.12 లక్షలను వెచ్చించింది. ఇలా నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం ఏకంగా రూ.33.74 కోట్లు వెచ్చించింది. గత సర్కారు 2014 – 19 మధ్య అరకొర విధానాలతో రూ.6.62 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగనన్న ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా కరోనాకు సంబంధించిన 10 రకాల చికిత్సలను 2021 మే, జూ నెలల్లో ఆరోగ్యశ్రీలోకి చేర్చింది. 2,144 మంది బాధితులకు ఉచితంగా కోవిడ్ చికిత్స కోసం రూ.35.16 లక్షల మేర ఖర్చు చేసింది.

**3,257కు పెరిగిన చికిత్సల సంఖ్య**

పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యానికి శ్రీకారం చుడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదలకు మరింత చేరువ చేస్తామని నాడు పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పొరుగు రాష్ట్రాల్లోని మహానగరాలైన బెంగళూరు, చెన్నై, హైదరాబాదులో 130కి పైగా ఆస్పత్రుల్లో 716 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కింద అందించే వ్యాధుల సంఖ్య 1,059 మాత్రమే ఉంది. వీటిని పెంచి 3,257కి చేర్చారు. ఇక క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితి లేకుండా వ్యయాన్ని భరించేందుకు సిద్ధమయ్యారు.


ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న వైద్య సిబ్బంది

**ఆరోగ్యశ్రీ ఆదుకుంది**



కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో నాకు కాళ్లు విరిగి పోయి నడవలేని పరిస్థితి. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించుకున్నాను. ఎలాంటి ఖర్చు లేకుండా చికిత్స చేసి ఇంటివద్దకు చేర్చారు. ఇప్పుడు కోలుకున్నాను. నేను బాగా నడవడానికి ఆరోగ్యశ్రీ ఎంతగానో దోహదపడింది.

– రాజేష్, మహంతువారిపల్లి

**చూపునిచ్చిన ఆరోగ్యశ్రీ**



కొంతకాలంగా కంటి చూపు దెబ్బతినింది. రాత్రిపూట బండి తోలాలంటే భయమేసేది. ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కింద మా ఊర్లో కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కింద రూపాయి ఖర్చు లేకుండా కన్ను ఆపరేషన్ చేసి లెన్స్ పెట్టారు. ఇప్పుడు నాకు కంటి చూపు బావుంది. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– గంగరామిరెడ్డి, నడవలూరు

**ఆరోగ్యశ్రీ కార్డు ఓ ధైర్యం**



ఆరోగ్య శ్రీ కార్డు మా ఇంట్లో ఉందనే ధైర్యం కుటుంబ పెద్దగా నాకు మనోధైర్యాన్ని ఇస్తుంది. రూ.25 లక్షల ఆరోగ్య శ్రీ కార్డు ఇవ్వడం వల్ల ఈ డబ్బు నా జేబులో ఉన్నట్లు అనిపిస్తుంది. మా ఆరోగ్యం కోసం జగనన్న తీసుకొచ్చిన ఈ పథకం మనిషి ఆయుష్షు మరింత పెంచుతుంది. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే మాలాంటోళ్లు క్షేమంగా ఉంటారు.

– వెంకటరత్నం, చిన్నగొట్టిగల్లు

**కోమా వరకు వెళ్లాను**



నాకు హఠాత్తుగా విరేచనాలు కావడంతో నీరసించిపోయారు. ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తే ఇక్కడ కుదరని వైద్యులు చెప్పారు. నాకు ఆరోగ్యశ్రీ కార్డు ఉండంతో రుయాలో అడ్మిట్ అయ్యాను. అక్కడ కూడా వైద్యులు సేవలందించారు. ఓ దశలో కోమా వరకు వెళ్లాను. అయినా వైద్యులు సేవలు, ప్రభుత్వం పుణ్యమా అని ఈరోజు ఇలా ఉన్నాను.

– ఆర్. చాంద్ బీ, నరసింగాపురం, ముస్లిం కాలనీ

## మంత్రి పెద్దిరెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డికి ముక్కంటి జ్ఞాపికను, మిథున్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అంజూరుతారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి/తిరుపతి మంగళం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. తిరుపతిలోని వారి కార్యాలయంలో గురువారం కలిశారు. వేదపండితులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆశీర్వదించారు. వారికి ముక్కంటి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందించి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఏఈవో ధనపాల్, వేద పండితులు నారాయణస్వామి, వశిష్టశర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం జూనియర్ ఇంటర్, శనివారం సీనియర్ ఇంటర్‌కు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దీనికోసం అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరా లైవ్ స్ట్రీమ్ ద్వారా పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఏఎన్ఎం అందుబాటులో ఉంటారని, 144సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు 4, సిట్టింగ్ స్క్వాడ్లు 2, డీఈసీ కమిటీ సభ్యులు, 1205మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సులకు 30,440మంది, ఒకేషనల్ కోర్సులకు 1,211మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సులకు 30,162మంది, ఒకేషనల్ కోర్సులకు 1,242మంది, మొత్తం 62,955 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. తిరుపతి ఆర్ఐఓ కార్యాలయంలో 0877–2237200 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

## జగనన్నను గెలిపించేందుకు జనం సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వేదికపై మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

- టీటీడీ చైర్మన్‌గా చేస్తున్న సేవతో నా జన్మ ధన్యమైంది
- తిరుపతిలో ఓట్లడిగే ధైర్యం టీడీపీకి లేదు
- సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం:** రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపా రు. టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణా కర రెడ్డి అధ్యక్షతన, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం తిరుపతి ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఒంగోలు సిద్ధం సభ సన్నాహ క సమావేశం నిర్వహించారు. కరుణాకర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు చోట్ల సిద్ధం సభలు నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారని రాష్ట్రంలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలే తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొస్తాయని చెప్పారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని వివరించారు. ఈ రోజు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీకి 142 నుంచి 144 స్థానాలు వస్తాయని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్నాయన్నారు.

**శ్రీవారి ఆశీసులతో..**

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీసులు, జగనన్న సహకారంతో రెండోసారి టీటీడీ చైర్మన్‌గా అవకాశం లభించిందని భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. దాంతో టీటీడీ ఉద్యోగులు సంతోషంగా ఉండేలా పాలక మండలిలో నిర్ణయాలు తీసుకున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులతో సహా 7,500 మందికి సొంతింటి కల నెరవేర్చామని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సహా 21వేల మందికి కనీసం రూ.5 వేలకు తగ్గకుండా జీతాలు పెంచామన్నారు. భక్తులకు, టీటీడీ ఉద్యోగ, కార్మికులకు చేస్తున్న సేవతో నా జన్మ ధన్యమైందని చెప్పారు.

**పథకాలతో పేదల అభ్యున్నతి**

జగనన్న అందించిన సంక్షేమ పథకాలు పేద ప్రజల అభ్యున్నతికి ఎంతో దోహదపడ్డాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చెప్పారు. దాంతో ప్రతి పేదవాడు జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న సహకారంతో తిరుపతిలో జరిగిన అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందంటే ఎంతలా అభివృద్ధి చేశామో తెలుస్తోందన్నారు. తిరుపతి అభివృద్ధిపైన ప్రశ్నించే దమ్ము, ధైర్యం టీడీపీ వాళ్లకు లేదని హెచ్చరించారు. 14 ఏళ్లలో ఏనాడూ తిరుపతి అభివృద్ధిని పట్టించుకోని టీడీపీ నాయకులకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉందా? అని ప్రశ్నించారు. సిద్ధం సభలతో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణ తెలుస్తోందన్నారు. అనంతరం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు, వివిధ ఆలయ చైర్మన్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



## వచ్చేది జగనన్న సంక్షేమ ప్రభుత్వమే

**నాగలాపురం:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న సంక్షేమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అపరంజిరాజు, స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ గత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కార్యకర్తలకు మొండి చేయి చూపించారని అందువల్ల ఏదో ఒక రూపాన పార్టీ నుంచి వైదొలగి నింద పార్టీ అధిష్టానంపై వేస్తున్నారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలోనే చెరగని ముద్ర వేసుకున్నారని ఆయన అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు చూచించారు. జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు బీరేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఎంపీపీ సింధూ, వైస్ఎంపీపీ కుమారి, నాయకులు జేబీ మునిరత్నం, మహేష్ రెడ్డి, శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి, జగదీష్ రెడ్డి, దేశప్పన్, కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త రాజేష్

**సమస్యలపై ఆరా**

మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎంపీ ఆరా తీశారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో ఎంపీ నేరుగా మాట్లాడి కార్యకర్తలు నాయకులకు అందుబాటులో ఉండి న్యాయం చేయాలని ఆదేశించారు. మండలంలోని టి.పి.కోట– చిన్న పాండూరు రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించి, ఎంపీ చేతులమీదుగా భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరలో రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆయన అన్నారు.

## క్లుప్తంగా

### రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

**ఏర్పేడు:** ఉపాధిహామీ సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించకుంటే ఇళ్లకు పంపుతామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండల ఉపాధిహామీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ రైతుల పొలాల్లో పూలు, పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. తిరుపతి సీఎల్ఆర్సీ సీడీ చంద్రశేఖర్ రాజు, ఏపీఓ దేవరి, ఏఈ బాలాజీ రావు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో నిర్మాణ కూలీ మృతి



భవనంపై నుంచి విద్యుత్ షాక్‌కు గురైన వివాహిత స్వాతిని తీసుకొస్తున్న తోటి కార్మికులు



మృతి చెందిన స్వాతి

**రేణిగుంట:** మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో భవన నిర్మాణ పనులు చేస్తూ విద్యుత్ షాక్‌తో కూలీ మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, రేణిగుంట బుగ్గవీధికి చెందిన సింహాచలం భార్య స్వాతి(35) వినాయకనగర్‌లోని ఓ ఇంటి నిర్మాణ పనులకు గురువారం ఉదయం వెళ్లింది. ఆమె సాయంత్రం ఇనుప కమ్ములు మెట్లపై నుంచి తీసుకెళుతుండగా, పక్కనే ఉన్న 11కేవీ లైను విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కుప్పకూలింది. వెంటనే ఆమెను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు రుయా వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఇక్కడకు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

# వైభవం.. కల్యాణ వెంకన్న ధ్వజారోహణం

భూదేవిని వివాహమాడి, ఆరుమాసాల పాటు శ్రీవేంకటేశ్వరుడు విడిది చేసిన క్షేత్రం.. భక్తుల కోర్కెలను తీరుస్తూ..కల్యాణ వేంకటేశ్వరుడిగా పూజలందుకుంటున్న పుణ్య స్థలం శ్రీనివాసమంగాపురంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణ ఘట్టంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మార్చి 8వ తేదీ వరకు ఉదయం, రాత్రి వివిధ వాహనాలపై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తూ అనుగ్రహించనున్నారు. తొలిరోజు పెద్ద శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

- కనులపండువగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- పెద్ద శేష వాహనంపై విహరించిన శ్రీహరి
- తిరుమల తరహాలో బ్రహ్మోత్సవాల నిర్వహణ: జేఈఓ వీరబ్రహ్మం



ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న జేఈఓ దంపతులు

**చంద్రగిరి:** శ్రీనివాస మంగాపురంలో టీటీడీ అనుబంధ శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన ధ్వజారోహణం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. అనంతరం 7నుంచి 8.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, గరుడాళ్వార్, చక్రతాళ్వార్ ఉత్సవమూర్తులు తిరుమాడవీధుల్లో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తదుపరి ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో అర్చకులు, విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడి చిత్రం కూడిన వస్త్రానికి పూజలు చేసి, ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఈ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

**భక్తులకు విస్తృత ఏర్పాట్లు : జేఈఓ**

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. 4వ తేదీన గరుడ సేవ, 5న స్వర్ణ రథోత్సవం, 7న రథోత్సవం, 8న చక్రస్నానం ప్రధానమైనవని పేర్కొన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. తొమ్మిదిరోజుల పాటు భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ ఉంటుందన్నారు. ఆలయం, పరిసరాల్లో భక్తులను ఆకర్షించేలా పుష్పాలంకరణలు, విద్యుద్దీపాల కటౌట్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూలను ఇక్కడ భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.



వాహన సేవ ముందు కళా ప్రదర్శనలు

### గొడుగుల సమర్పణ

తమిళనాడులోని తిరునింద్రవూర్ శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్ట్ వారు బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం గొడుగులను సమర్పించారు. జేఈఓ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో గొడుగులను ఆలయ అధికారులకు అందజేశారు. 15 ఏళ్లుగా గొడుగులను బ్రహ్మోత్సవాలకు అందిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

### బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం ఉదయం చిన్నశేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై స్వామివారు తిరువీధుల్లో విహరించనున్నారు.

**వైకుంఠనాథుని అవతారంలో..**

గురువారం రాత్రి కల్యాణ వెంకన్న శ్రీదేవి, భూదేవి సమేతంగా పెద్దశేషవాహనంపై వైకుంఠనాథుడి అవతారంలో తిరు మాడవీధుల్లో విహరించారు. గజరాజులు, అశ్వాలు ముందుకు సాగుతుండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

# భారతదేశంలో సాంకేతిక విప్లవం

**నారాయణవనం:** ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ స్వీయ అభివృద్ధితో భారతదేశం సాంకేతిక విప్లవాన్ని సృష్టిస్తోందని డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ శరవేగంగా వృద్ధిరేటును సాధించిందని అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుందని వివరించారు. మన దేశం సొంతంగా తయారు చేసిన ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ రాకెట్‌లను విజయవంతంగా నింగిలోకి పంపిందని గుర్తు చేశారు. రక్షణ రంగంలో బ్రహ్మోస్, అగ్ని, అగ్ని-1,2,3, ఆకాష్, అర్జున్ ట్యాంకర్లు, న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లతో దేశ రక్షణ బలాన్ని పెంచుకున్నామని అన్నారు. సబ్‌మెరైన్‌ల తయారీలో జర్మన్ తర్వాత మన దేశమే రెండో స్థానంలో ఉందని వివరించారు. నేడు ప్రపంచమే భారతదేశం వైపు చూసే స్థాయికి మనం సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి సాధించామని అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో యువ ఇంజినీర్లు పరిశోధనలు జరిపి దేశ ప్రతిష్టతను పెంచడానికి కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐటీతో పాటు ఐసర్‌ను అభివృద్ధి చేసిందని అన్నారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకే పరిమితం కాకుండా దేశ రక్షణలో, సాంకేతిక అభివృద్ధికి యువ ఇంజనీర్లు ప్రత్యేక భూమికను పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం సతీష్‌రెడ్డిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న అశోకరాజు

# వైఎస్సార్ సీపీలోకి టీడీపీ శ్రేణులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో తుడా చైర్మన్, సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**తిరుపతి రూరల్:** చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి టీడీపీ శ్రేణుల వలసలు కొనసాగుతున్నాయి. చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెనికి చెందిన 8 కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తుమ్మలగుంటలో గురువారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారికి పార్టీ కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ పాలన, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆత్మీయతకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గెలుపునకు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. పార్టీలో చేరిన వారిలో చంద్రశేఖర్, ప్రసాద్ రెడ్డి, పొట్టిగానితోపు గ్రామంలో పాదిలి మునికుమార్, బత్తల ప్రవీణ్, పాదిలి కృష్ణయ్య, శోభన్ బాబు, బత్తల చెంగల్రాయులు, పాదిలి లోకనాథం, పాదిలి రాజయ్య, శంకరయ్య, గిరి బాబు, బోయిని చంద్రబాబు, డేగజిచ్చు చెంగయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేంద్ర రెడ్డి, రవీంద్ర నాథ్ రెడ్డి, రవీంద్ర నాథ్ రెడ్డి పాదిలి సుబ్రహ్మణ్యం, రాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాల్లో సామాన్యులకు ప్రాధాన్యం

- కలిసికట్టుగా విజయవంతం చేద్దాం : కలెక్టర్ లక్ష్మీశ
- బ్రహ్మోత్సవాల్లో పటిష్ట బందోబస్తు : ఎస్పీ మాలికా గార్గ్



మాట్లాడుతున్న కలెక్టర్‌లక్ష్మీశ

**శ్రీకాళహస్తి:** సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఆలయ త్రినేత్ర అతిథి గృహంలో గురువారం అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయనకు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తించి వాటిని అధిగమించి ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతలు, బందోబస్తు, భక్తుల భద్రత, పార్కింగ్, వాహనాల మళ్లింపుపై పోలీసుశాఖ పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బాల్యవివాహాలు జరగకుండా ఐసీడీఎస్, పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. లింగోద్భవం, మహాశివరాత్రికి ప్రత్యేక బందోబస్తు, భద్రత ముఖ్యమని తెలిపారు. మెడికల్ క్యాంపులు, 108 అందుబాటులో ఉండాలని తెలిపారు. భక్తు సౌకర్యార్థం సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని, ఆ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు.

**విద్యుత్ అంతరాయం లేకుండా..**

బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అన్ని శాఖల ముఖ్య అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అందిన ఫిర్యాదుపై సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక అధికారులు ఆలయంలో అన్ని పరికరాలు సర్దిపై చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ బాగా ఉండేలా చూడాలన్నారు. పండుగ వాతావరణంలో బ్రహ్మోత్సవాలు జరగాలని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తెలిపారు. ఫ్లెక్సీలు నియంత్రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**నిర్దేశిత ప్రాంతాల్లో పార్కింగ్**

పట్టణంలో నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని ఎస్పీ మాలికా గార్గ్ స్పష్టం చేశారు. ఆలయ సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా గుర్తింపుకార్డులు లేదా పాసులు కలిగి ఉండాలన్నారు. లేకపోతే అనుమతి ఉండదని తెలిపారు. కమాండ్ కంట్రోల్, అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కలెక్టర్‌ను కలిశారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై చర్చించారు. పరిసరాలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు కలెక్టర్ లక్ష్మీశ భక్తులతో కలిసి అన్నదానం కేంద్రంలో భోజనం చేశారు. వారిని అడిగి భోజన నాణ్యతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీలు కులశేఖర్, రాజేంద్ర, విమలకుమారి, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### 15 వరకు రేషన్ డీలర్ల రెన్యువల్

**తిరుపతి అర్బన్:** చౌకదుకాణపు డీలర్లు ఆన్‌లైన్‌లో సమీపంలోని సచివాలయంలో ఆథరైజేషన్ రెన్యువల్ చేసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఇస్తున్నట్లు వెల్లడించారు. 2024తో గడువు ముగుస్తున్న డీలర్లు రూ.500 చలానాను సచివాలయంలో చెల్లించి 2026 వరకు ఆథరైజేషన్ రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. అయితే 2025కి గడువు ముగుస్తున్న డీలర్లు పైసా చెల్లించకుండా ఇప్పుడే ఆథరైజేషన్ రెన్యువల్ చేయించుకోవచ్చని వివరించారు. వారికి 2027 వరకు ఆథరైజేషన్ రెన్యూవల్ చేస్తారని తెలిపారు.

### మూడు వాహనాలు ఢీ : ఒకరి మృతి



ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్



మృతి చెందిన డ్రైవర్ వినోద్

**ఓజిలి:** స్థానిక జాతీయ రహదారిపై రాచపాళెం సమీపంలో మూడు వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చెన్నై నుంచి వరికోత యంత్రంతో మినీ లారీ గూడూరు వైపు బయల్దేరింది. ఈ క్రమంలో రాచపాళెం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. అతివేగంగా వెళుతున్న లారీ డివైడర్‌పై నుంచి దూసుకెళ్లి అవతలి రోడ్డుపై నెల్లూరు నుంచి నాయుడుపేట సమీపంలోని కళ్యాణమండపానికి క్యాటరింగ్‌తో వెళ్తున్న బొలేరో వ్యానును ఢీకొంది. అదే సమయంలో గూడూరు నెల్‌క్యాస్ట్ నుంచి ఇనుప సామగ్రిని చెన్నైకు తీసుకెళ్తున్న లారీ బొలేరోను ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో డ్రైవర్ వినోద్(33) మృతి చెందాడు. క్యాటరింగ్ ఇచ్చేందుకు బొలేరోలో ప్రయాణిస్తున్న రమణమ్మ, వెంకటేశ్వర్లు, రిబికా, రవి, వీరేష్, మోనేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఓజిలి 108, స్వర్ణటోల్‌ప్లాజా 108 అంబులెన్స్‌ల్లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం క్షతగాత్రులను నెల్లూరుకు తరలించారు. జాతీయ రహదారిపై మూడు వాహనాలు ఢీ కొనడంతో ట్రాఫిక్ కొంత సేపు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఓజిలి పోలీసులు సంఘటన స్థలం చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాళహస్తిలో పంచ వంతెనలు కలుపుతూ రూ.29కోట్లతో శివం టు శివం రోడ్డు పనులకు, రూ.4.5 కోట్లతో స్వర్ణముఖి ఎడమవైపు కట్ట సుందరీకరణ పనులకు, రూ.3.2 కోట్లతో కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ అనంతరం శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెలహరి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు - శ్రీకాళహస్తి

# ప్రభుత్వ పాఠశాలల్లో బోధన భేష్

- ఐబీ కరికులం అంతర్జాతీయ ప్రతినిధులు
- 2025-26లో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్
- ప్రభుత్వ పాఠశాలల్లోని నదుపాయాలపై అధ్యయనం



బోధన పరిశీలిస్తున్న ఐబీ బృందం సభ్యులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబీ) సిలబస్‌ను అమలు చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముమ్మర చర్యలు చేపట్టింది. 2025-26విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్ బోధనకు అన్ని ఏర్పాట్లు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వాటిలోని నదుపాయాలపై అధ్యయనం చేసేందుకు ఐబీ కరికులం అంతర్జాతీయ ప్రతినిధులు ఏడుగురు సభ్యుల బృందం ఇటీవల విజయవాడకు చేరుకుంది. వీరు మూడు బృందాలుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల, మున్సిపల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను మార్చి 7వ తేదీ వరకు పర్యటించి అధ్యయనం చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం అమెరికాకు చెందిన ఐబీ కరికులమ్ రూపకల్పనలో సీనియర్ మేనేజర్ వెండీగ్రీన్, ఇంగ్లండ్‌కు చెందిన పర్సనల్ డెవెలప్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎరిక్‌బాబర్ తిరుపతి చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలుచేస్తున్న కరికులమ్, ద్విభాషా పాఠ్య పుస్తకాలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసనలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫాం(ఐఎఫ్‌పీ)ల పాత్రను పరిశీలించారు. విద్యార్థుల చేతుల్లో ట్యాబ్‌లను చూసి, వాటిని ఎలా వినియోగిస్తున్నారో స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిస్పందనలు, ఉపాధ్యాయుల బోధనా మెళకువలను పరిశీలించి అభినందించారు. సైన్సు ల్యాబ్, లైబ్రరీ, పాఠశాల ఆవరణలోని పరిశుభ్రత, విద్యార్థుల యూనిఫాం చూసి మెచ్చుకున్నారు.

**ఐబీ బృందం ప్రశంసలు**

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్య ఐబీ కరికులమ్‌కు సమకాలీకంగా ఉందని ఐబీ బృందం పేర్కొన్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యావిధానం, బోధన, మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐబీ కరికులమ్ రాష్ట్ర కోఆర్డినేటర్, ఎస్సీఈఆర్‌టీ ప్రొఫెసర్ వై.గిరిబాబు యాదవ్, తిరుపతి అర్బన్ ఎంఈఓ-1 బాలాజీ, అసిస్టెంట్ ఏఎంఓ మధు, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.